పాలిథిన్ నిషేధంపై నీలినీడలు

- విచ్చలవిడిగా పాలిథిన్ సంచుల వినియోగం
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- కాలుష్యం కోరల్లో పర్యావరణం
- వ్యాధుల బారినపడుతున్న ప్రజలు
- నిషేధాజ్ఞలు అమలు చేయాలని విజ్ఞప్తి

రాజాం సిటీ:

మున్సిపాలిటీలో పాలిథిన్ నిషేధంపై నీలినీడలు కమ్ముకున్నాయి. గతంలో దీనిపై స్పందించిన స్వచ్ఛంధ సంస్థలు జాడ కూడా నేడు కానరావడం లేదు. అధికారులు సైతం పట్టించుకోవడం మానేశారు. దీంతో విచ్చలవిడిగా పాలిథిన్ కవర్ల వినియోగం, విక్రయాలు పెరిగిపోయింది. ఈ నేపథ్యంలో కాలుష్య కోరల్లో రాజాం, పరిసర మండలాల ప్రజలు చిక్కుకుపోతున్నారు. కొంతమంది రోగాల బారినపడి బాధపడుతున్నారు. గతంలో పాలిథిన్ నిషేధంలో పట్టణానికి అవార్డు సైతం వచ్చింది. అప్పట్లో ప్రతి షాపు దగ్గర ఇచ్చట పాలిథిన్, ప్లాస్టిక్ కవర్లు ఇవ్వబడవు అని నోటీసు బోర్డులు దర్శనమిచ్చేవి. కాలక్రమేణా అధికారులు పట్టించుకోకపోవడంతో మళ్లీ పాలిథిన్, ప్లాస్టిక్ కవర్లు విచ్చలవిడిగా మార్కెట్‌లోకి వచ్చి, ప్రజావినియోగంలో భాగమయ్యాయి. అధికారులు పట్టించుకోకపోవడం వల్లే నిషేధం అమలు సక్రమంగా జరగడం లేదన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.



రాజాంలోని ఓ కిరాణాషాపులో తనిఖీలు నిర్వహిస్తున్న మున్సిపల్ సిబ్బంది(ఫైల్)

కొరవడిన చిత్తశుద్ధి..

పాలిథిన్ నిషేధాన్ని అమలు చేస్తూ 2011లో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అప్పటి నుంచి రెండేళ్ల పాటు పాలిథిన్ కవర్ల నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, వ్యాపార సముదాయాల్లో ఆకస్మికదాడులు నిర్వహించి, అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. కాలం గడిచిని కొద్దీ మారిన అధికారుల తీరు కారణంగా పాలిథిన్ నిషేధం అమలుపై అధికారుల చిత్తశుద్ధి కొరవడింది. యథా రాజా.. తథా ప్రజా అన్న చందంగా పరిస్థితి తయారైంది. దీంతో ఎక్కడపడితే అక్కడ పాలిథిన్ కవర్ల వినియోగం ఎక్కువైంది. కొంతమంది అధికారులు తాయిలాలకు అలవాటు పడడంతోనే ఈ పరిస్థితి దాపురించిందని పట్టణవాసులు విమర్శిస్తున్నారు.

నామమాత్రంగా తనిఖీలు..

పట్టణంలోని పలు దుకాణాల్లో మున్సిపల్ అధికారులు నామమాత్రంగానే తనిఖీలు నిర్వహిస్తున్నారనే విమర్శలు బాహాటంగానే ఇప్పుడు వినిపిస్తున్నాయి. గతంలో పాలిథిన్ నిషేధం పక్కాగా అమలుచేసి, రాజాం పట్టణాన్ని ఆదర్శవంతమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు అధికారులతో పాటు స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు కూడా తమదైన శైలిలో కృషి చేశారు. అటు వ్యాపారులు, ఇటు ప్రజలకు అవగాహన కల్పించి, పాలిథిన్ నిషేధానికి విశేషంగా కృషి చేశారు. గతంలో మాదిరిగానే మళ్లీ రాజాం పట్టణాన్ని పాలిథిన్ రహితంగా తీర్చిదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.

చాటుమాటుగా విక్రయాలు..

పట్టణంలోని హోటళ్లు, తోపుడుబండ్లు, వీధి విక్రయదారులు, కూరగాయల వ్యాపారులు, కిరాణా దుకాణాలు, సూపర్ మార్కెట్‌లతో పాటు చికెన్, మటన్, చేపల షాపుల వద్ద చాటుమాటుగా పాలిథిన్ కవర్లు వినియోగిస్తున్నారు. అధికారులు ఎన్నిసార్లు దాడులు జరిపి, జరిమానా విధించినా షరా మామూలుగానే దుకాణాదారులు, వ్యాపారులు వ్యవహరిస్తున్నారు. ఫలితంగా పాలిథిన్ నిషేధానికి ఎప్పటికప్పుడు తూట్లు పొడుస్తూనే ఉన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, కఠిన చర్యలు తీసుకోవాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

అన్నీ అనర్థాలే..

పాలిథిన్ మట్టిలో కలవకపోవడంతో నీరు, మట్టి కాలుష్యమై పర్యావరణానికి పెనుముప్పుగా పరిణమిస్తోంది. దీంతో ప్రమాదం పొంచి ఉందనే భావనను పర్యావరణవేత్తలు వ్యక్తం చేస్తున్నారు.

పాలిథిన్ వాడకం వల్ల కలిగే అనర్థాలు..

- వర్షంనీరు భూమిలో ఇంకిపోకుండా అడ్డుపడుతుంది.
- పాలిథిన్ కణాలు మట్టిసారాన్ని తగ్గిస్తాయి.
- కాలువలో పేరుకుపోయి మురుగునీరు ప్రవాహాన్ని అడ్డుపడుతుంటాయి. దీంతో ఎక్కడికక్కడే మురుగునీరు స్తంభించిపోయి దోమల ఉత్పత్తికి నిలయాలుగా మారుతాయి. తద్వారా వ్యాధులు ప్రబలుతాయి.
- మూగజీవాలు కవర్లలో ఉన్న వ్యర్థ పదార్థాలను చూసి కవర్లుతో పాటు తినేయడం వలన వాటి కడుపులో పేగులుకు చుట్టుకుని ప్రాణాలు కోల్పోతాయి.



పాలిథిన్ కవర్లలో అరటిపండ్లు తీసుకువెళ్తున్న దృశ్యం(ఫైల్)

పాలిథిన్ నిషేధానికి చర్యలు చేపట్టాలి..



రాజాం పట్టణంలో పాలిథిన్ కవర్ల నిషేధానికి అధికారులు చర్యలు చేపట్టాలి. తూతూమంత్రంగా దాడులు నిర్వహించి, చేతులు దులుపుకోవడం కాకుండా ఎప్పటికప్పుడు నిషేధం అమలు పర్యవేక్షించి, పాలిథిన్ కవర్లు వాడకుండా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి. అంతేకాకుండా గుడ్డసంచుల వాడకం వల్ల కలిగే మేలును వివరించాలి.
–దోల వాసుదేవరావు,ఉపాధ్యాయుడు,రాజాం.

చర్యలు తీసుకుంటున్నాం..



పట్టణంలో పూర్తిస్థాయిలో పాలిథిన్ నిషేధమే లక్ష్యంగా ప్రతిరోజూ దాడులు చేపడుతున్నాం. గతంలో మాదిరిగా పాలిథిన్ రహిత రాజాంను తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గుడ్డసంచులు, కాగితపు సంచులు వాడేలా ఇప్పటికే షాపుల యజమానులకు సూచించాం. ఇంకా ఎవరైనా వినియోగిస్తే వారిపై కూడా చర్యలు తీసుకుంటాం. ప్రజలు కూడా గుడ్డ సంచులు వాడకం అలవాటు చేసుకోవాలి.
–సీహెచ్ ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, రాజాం మున్సిపాలిటీ.

పరిష్కారాలు ఇవే..

- పాలిథిన్ నిషేధంపై అధికారులు చిత్తశుద్ధి కనబరచాలి.
- ప్రజల్లో అవగాహన కల్పించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకురావాలి.
- ఉత్పత్తిదారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి.
- అమ్మకందారులపై కేసులు నమోదు చేయాలి.

క్లుప్తంగా

ఉత్సాహంగా ఒలింపిక్ డే రన్



కార్యక్రమంలో పాల్గొన్న క్రీడాకారులు

బొబ్బిలి: పట్టణంలో ఒలింపిక్ డే రన్ ఆదివారం నిర్వహించారు. అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ ఏర్పాటు దినం పురస్కరించుకుని, స్థానిక క్రీడాప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, ఔత్సాహికులు పరిగెడుతూ జాతీయ జెండా ప్రదర్శించారు. అనంతరం ఒలింపిక్ డే విశిష్టతను వక్తలు వివరించారు. కార్యక్రమంలో పట్టణ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు రావు శ్రీనివాసరావు, రాజేశ్వరరావు, సిరిపురపు ప్రసాద్, మీసాల వినయ్‌కుమార్, క్రీడాకారులు, క్రీడాశిక్షకులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి



ఈశ్వరనారాయణ కాలనీలో పాడైన తాగునీటి బోరు

రాజాం: పట్టణంలోని ఈశ్వరనారాయణ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆ కాలనీవాసులు కోరుతున్నారు. కుళాయిల ద్వారా సక్రమంగా నీరు రావడం లేదని, వార్డులో ఉన్న తాగునీటి బోరు సైతం పాడైందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి, కుళాయిల ద్వారా నీరు అందేలా చేయాలని, అలాగే మరమ్మతులకు గురైన బోరును బాగుచేయాలని విజ్ఞప్తి చేశారు.

108 వాహనంలో ప్రసవం



పుట్టిన బిడ్డను చూపిస్తున్న 108 సిబ్బంది

రేగిడి: మండల పరిధిలోని ఏవీపురానికి చెందిన దార పావని అనే గర్భిణి 108 వాహనంలో ఆదివారం ప్రసవించి, పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. ఒక్కసారిగా పురిటినొప్పులు రావడంతో ఏఎన్ఎం పద్మావతి, ఆశ కార్యకర్త సరోజినిలు 108కు సమాచారం ఇచ్చారు. గ్రామానికి వచ్చిన వాహనంలో పావనిని బూరాడ ఆస్పత్రికి తరలిస్తుండగా నొప్పులు అధికమై, మార్గమధ్యంలో డెలివరీ అయింది. ఆమె సుఖప్రసవానికి సహాయక చర్యలు అందించిన ఈఎంటీ గార రామకృష్ణ, పైలట్ జి.నారాయణరావులను పావని బంధువులు అభినందించారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి



విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదువంటే మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో పుస్తకాలు ఏ విధంగా చదవాలో నేర్పించారు. అలాగే కథలు చెప్పడం, రాయడం, బొమ్మలు వేయడం వంటివి తెలియజేశారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



కాంగ్రెస్ సీనియర్ నేత శ్రీనివాసరావు

బొబ్బిలి: బాపట్ల జిల్లాలోని చీరాలలో 21 ఏళ్ల యువతిపై లైంగికదాడికి పాల్పడి, కర్రలతో కొట్టి చంపిన దుండగులను పట్టుకుని, కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మువ్వల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఆ దుర్ఘటన తనను కలచివేసిందని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. వీలైనంత త్వరగా నిందితులను పట్టుకుని, శిక్ష పడేలా చేసి, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

కనకమహాలక్ష్మికి ప్రత్యేక పూజలు

చీపురుపల్లి: పట్టణంలోని కనకమహాలక్ష్మి ఆలయంలో ప్రధాన అర్చకులు ఆరవెల్లి రవిశర్మ నేతృత్వంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆనవాయితీ ప్రకారం అమ్మవారికి ఆదివారం ప్రత్యేకత కలిగిన రోజు కావడంతో తెల్లవారు జామున 5 గంటలకు పంచామృతాభిషేకాలు చేసి, అనంతరం పుష్పాలంకరణ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరు కుమార్ నేతృత్వంలో దాతల సహకారంతో దేవస్థానం ఆవరణలో భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు.

పుస్తకాలు, పెన్నులు అందజేత

బొబ్బిలి రూరల్: మండలంలోని పక్కి గ్రామ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు షట్‌చక్ర సాధన పీఠం వారు వితరణ చేసిన పుస్తకాలు, పెన్నులను ఎంపీపీ లక్ష్మీ వేణుగోపాలనాయుడు చేతులమీదుగా ఆదివారం అందజేశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ గ్రామీణ పేద విద్యార్థులను ఆదుకునేందుకు దాతలు, సంస్థలు ముందుకువస్తుండడం చాలా సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు కూడా క్రమశిక్షణతో మెలగి, మంచిగా విద్యాబుద్ధులు నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు శంబంగి వేణుగోపాల నాయుడు, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి రూరల్: బొబ్బిలి ఎమ్మెల్యే బేబి నాయన పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులు మండలంలోని రాజచెరువువలసలోని నిరుపేద విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ఎంపీపీ లక్ష్మీవేణుగోపాలనాయుడు

పార్వతీదేవికి ఉజ్జాపన పూజలు



ప్రత్యేకాలంకరణలో పార్వతీదేవి అమ్మవారు

బాడంగి: స్థానిక ఉమాసోమేశ్వరాలయంలోని పార్వతీదేవికి ఉజ్జాపన పూజలు ఆదివారం నిర్వహించారు. 41 వారాల పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో అమ్మవారికి మండప పూజలు చేసిన మహిళలతో అర్చకులు ఈ ఉజ్జాపన పూజలు చేయించారు. తొలుత అమ్మవారి విగ్రహాన్ని పవిత్ర నదీజలంతో శుద్ధి చేసి, అనంతరం పంచామృతాలతో అభిషేకం చేశారు. ఆ తర్వాత మండపారాధన చేసి, అమ్మవారికి విశేష పూజలు చేపట్టారు. ఈ నేపథ్యంలో అమ్మవారిని ఆభరణాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు.

వంగర: మండలంలోని రుషింగి గ్రామంలో వెలసిన శ్రీదుర్గాదేవి ఆలయంలో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. కొప్పరవలస, కె.కొత్తవలస, తలగాం, కిమ్మి తదితర గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు.

బాడంగి సీహెచ్‌సీకి రోగుల తాకిడి

బాడంగి: సీహెచ్‌సీకి రోగుల తాకిడి ఎక్కువవుతోంది. తీవ్ర అస్వస్థతతో బాధపడుతున్న చాలామంది ఆదివారం కూడా ఆస్పత్రికి వచ్చి, వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కొంతమంది అవసరమైన మందులు తీసుకుని, ఇంటికి వెళ్లిపోగా, మరికొంతమంది చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేరారు. ఇన్‌పేషెంట్లలో చాలామంది డయేరియాతో బాధపడుతుండగా వారికి వైద్యులు, సిబ్బంది సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం ఆస్పత్రిలో చేరుతున్న వారికి సరిపడ గదులు లేకపోవడంతో వరండాలోనే బెడ్లు వేసి, రోగులకు వైద్యసేవలందిస్తున్నారు.



ఆస్పత్రి వరండాలో చికిత్స పొందుతున్న రోగులు

• జోరందుకున్న ఖరీఫ్ పనులు



తెర్లాం: లింగాపురంలో నాగలి సహాయంతో దుక్కి చేస్తున్న రైతు

ఖరీఫ్ పనులు జోరందుకున్నాయి. అడపాదడపా కురుస్తున్న వర్షాలతో సాగుకు అనుకూలంగా ఉండడంతో రైతులు పొలంబాట పట్టారు. ఓ వైపు దుక్కి పనులు చేస్తూ మరోవైపు సిద్ధం చేసిన నారుమడుల్లో వరి విత్తనాలు చల్లుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో ఏర్పాటైన రైతు భరోసా కేంద్రాల ద్వారా ఉన్న ఊరిలోనే విత్తనాలు, ఎరువులు దొరుకుతుండడంతో వ్యవసాయం సులువైందని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చాలాచోట్ల వ్యవసాయ పనుల్లో రైతులు నిమగ్నమైన దృశ్యాలు ఆదివారం ఇలా కనిపించాయి.
–తెర్లాం, రాజాం, రేగిడి, సంతకవిటి



రాజాం: గడిముడిదాంలో ఫెర్టికమ్ సీడ్‌డ్రిల్ మిషన్‌తో వరి వెదలు వేయిస్తున్న అధికారులు



రేగిడిలో వరి విత్తనాలు చల్లుతున్న రైతు



సంతకవిటి: పోతులజగ్గుపేటలో సిద్ధం చేసిన నారుమడిలో వరి విత్తనాలు వేస్తున్న దృశ్యం

భారీ వాహనాల రాకపోకలతో అవస్థలు

బాడంగి: మండల కేంద్రంలోని మెయిన్‌రోడ్డు మీదుగా భారీ వాహనాల రాకపోకలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. రోడ్డు వెడల్పు తక్కువగా ఉండడంతో పాటు పాడైన ఈ రోడ్డు మీదుగా నిత్యం వెళ్తున్న లారీలు, టిప్పర్లు, కంటెయినర్ల కారణంగా ట్రాఫిక్ స్తంభించిపోతోందని, రోడ్డు కూడా మరింత అధ్వానంగా తయారైందని స్థానికులు అంటున్నారు. గుంతలమయమైన రోడ్డుపై వెళ్లాలంటే భయమేస్తోందని వాహనదారులు వాపోతున్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన



మాట్లాడుతున్న ఎస్ఐ దేవి

మెంటాడ: మండలంలోని పెదమేడపల్లి ఆదర్శ పాఠశాలలోని విద్యార్థులకు మాదకద్రవ్యాల నిర్మూలనపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ దేవి మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో యువత ఎక్కువగా మద్యం, గంజాయి, కొకైన్, హెరాయిన్, గుట్కా వంటి మత్తపదార్థాలకు బానిసలై తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో ఎవరైనా మాదకద్రవ్యాలు వినియోగించినట్లు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. చెడుఅలవాట్ల బారినపడకుండా మంచి అలవాట్లు అలవర్చుకోవాలన్నారు.

విత్తనశుద్ధిపై అవగాహన



విత్తనశుద్ధిని వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రేగిడి: మండలంలోని చాటాయివలస గ్రామంలో విత్తనశుద్ధిపై రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ ఐసీఆర్‌పీలు పైల తవిటినాయుడు, కె.రమణ మాట్లాడుతూ బీజామృతంతో విత్తనాలు శుద్ధి చేసి, పొలాల్లో వేసుకుంటే మంచిదని తెలిపారు. విత్తనాలు శుద్ధి చేసుకుని, వేసుకోవడం ద్వారా పంటకు పట్టే చీడపీడలు తగ్గుతాయని, తద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. ప్రతిఒక్కరూ ప్రధాన పంట విత్తనాలు వేసే ముందు బీజామృతంతో వాటిని శుద్ధి చేసుకోవాలన్నారు.

మొక్కలను సంరక్షించాలి

తెర్లాం: ప్రతిఒక్కరూ మొక్కలను సంరక్షించి, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని మండలంలోని రంగప్పవలస గ్రామ సర్పంచ్ శనపతి రాంబాబు అన్నారు. ఆ గ్రామంలోని నాంచారమ్మ చెరువుగట్టుపై నాటిన కొబ్బరి మొక్కల మధ్య ఉన్న కలుపుమొక్కలను ట్రాక్టర్ సహాయంతో తీయించే కార్యక్రమం ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని అన్ని చెరువు గట్లపై కొబ్బరి, సపోటా తదితర పండ్ల మొక్కలతో పాటు, టేకు మొక్కలు కూడా వందల సంఖ్యలో నాటామన్నారు. వాటిన్నింటికీ ప్రతిరోజూ నీరు పోసి సంరక్షించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామన్నారు. భవిష్యత్‌లో ఉద్యాన పంటల ద్వారా గ్రామ పంచాయతీకి అదనపు ఆదాయం సమకూరేలా మొక్కలు పెంచుతున్నామన్నారు.



కొబ్బరిచెట్ల మధ్య ఉన్న కలుపుమొక్కలను ట్రాక్టరు సహాయంతో తొలగిస్తున్న దృశ్యం

సాగునీటి కాలువలు బాగుచేయండి

తెర్లాం: మండలంలోని సాగునీటి కాలువలను బాగుచేయాలని రైతులు కోరుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించే వరి పంటకు సాగునీరు చెరువుల నుంచి వస్తోందని, అయితే సాగునీరు వచ్చే కాలువలు సక్రమంగా లేకపోవడంతో సాగునీరు అందే అవకాశాలు లేవని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని తెర్లాం గుర్రమ్మ చెరువు నుంచి వందలాది ఎకరాలకు సాగునీరు వచ్చే కాలువతో పాటు, ఆమిటి, లింగాపురం, కొరటాం, వెలగవలస, నందిగాం, కుసుమూరు, నందబలగ తదితర గ్రామాల్లోని సాగునీటి కాలువల్లో పిచ్చిమొక్కలు, పూడికలు దట్టంగా పెరిగిపోయాయన్నారు. ఇవి ఇలాగే ఉంటే ఖరీఫ్‌లో రైతులు పండించే పంటలకు సాగునీటి కాలువల ద్వారా నీరు అందడం అంతంతమాత్రమేనన్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులు స్పందించి, కాలువలు బాగుచేసే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



ఆమిటి సాగునీటి కాలువలో దట్టంగా పెరిగిన పిచ్చిమొక్కలు

పచ్చిరొట్టతో నేల సారవంతం

రేగిడి: పచ్చిరొట్ట ఎరువుతో నేల సారవంతమవుతుందని ఏవో జి.మురళీకృష్ణ తెలిపారు. మండలంలోని చాటాయివలస గ్రామంలో పీఎమ్‌డీఎస్ క్రాప్ కటింగ్, పచ్చిరొట్ట విత్తనాల ప్రయోజనాలపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన పంట సాగుకు ముందు ప్రతీ రైతు తమ పొలాల్లో పచ్చిరొట్ట విత్తనాలు వేసుకుని, సాగు చేయాలన్నారు. అలా పెరిగిన పచ్చిరొట్ట మొక్కలను అదే నేలలో కలియదున్నాలని తద్వారా భూసారం పెరిగి, ఆ తర్వాత వేసుకునే ప్రధాన పంటకు కావాల్సిన పోషకాలు నేల నుంచి లభిస్తాయన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ కె.శ్రీనివాసరావు, సర్పంచ్ కె.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.



నేల సారవంతానికి చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పిస్తున్న ఏవో మురళీకృష్ణ

భగవన్నామస్మరణతోనే మోక్షం

రేగిడి: భగవన్నామస్మరణతోనే మోక్షం చేకూరుతుందని, ప్రతిఒక్కరూ భగవంతుడిని ధ్యానించాలని పాలకొండకు చెందిన ఆధ్యాత్మిక వక్తలు ఎస్.వి.రమణ, ఎస్.దామోదరరావు అన్నారు. మండలంలోని దేవుదళ గ్రామంలో ఉన్న గీతాశ్రమంలో గొర్లె దామోదరరావు ఆధ్వర్యంలో గీత జ్ఞానబోధ సభ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగవంతుడిని ప్రతిరోజూ ప్రార్థించడం ద్వారా సకల పాపాలు తొలగిపోతాయని, దుఃఖాలు దరిచేరవని తెలిపారు. మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వక్తలు ఎం.మోహనదాస్, నిత్య సమరానందస్వామి, ఎం.జోగినాయుడు, ఎస్.త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆధ్యాత్మిక వక్త రమణ

• ప్రమాదం.. ఈ ప్రయాణం!





రోడ్డు ప్రమాదాల బారినపడి ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారు. మరెంతోమంది క్షతగాత్రులుగా మిగులుతున్నారు. వారిపై ఆధారపడి జీవించే ఇంకెంతో మంది రోడ్డున పడుతున్నారు. ఇలాంటివేవీ తమకు పట్టవన్నట్లు వ్యవహరిస్తున్నారు కొంతమంది ప్రజలు. ఏది ఏమైనా మేము మారమన్నట్లు ఆటోల్లో, బస్సుల్లో ఇలా ప్రయాణిస్తున్నారు. ఆదివారం పలుచోట్ల ఇలా ప్రమాదకరంగా విద్యార్థులు ప్రయాణిస్తూ కనిపించిన దృశ్యాలు సాక్షి కెమెరాకు చిక్కాయి.
–రామభద్రపురం